క్లుప్తంగా

రేపు గుండె జబ్బుల వైద్య నిపుణుల రాక

ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ఉదయం కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్ష చేయించుకోవాలనుకునేవారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

29న పంచాయతీ వేలంపాట

ముద్దనూరు : ముద్దనూరు మేజర్ పంచాయతీ ఆదాయానికి వేలంపాటను ఈనెల 29వ తేదీన నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈవో లక్ష్మీ నరసింహులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి (మే1 నుంచి 2026 మార్చి వరకు) పంచాయతీ పరిధిలో బస్టాండు నిర్వహణకు రూ.4 లక్షలు ధరావతు చెల్లించాలని, జంతు వధశాలకు రూ.40 వేలు ధరావతు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని ఆయన తెలిపారు. 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు వేలంపాట నిర్వహించనున్నట్లు, వేలంపాటలో పాల్గొనే వారు పంచాయతీకి ఎటువంటి బకాయిలు వుండరాదని ఇతర వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

వధూవరులకు అశీర్వాదం



శీర్వదిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని మొయిళ్లకాల్వ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఖాదర్‌వల్లి, నూర్ ఏ చష్మిలకు గురువారం వివాహం జరిగింది. శుక్రవారం మొయిళ్లకాల్వలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, మండల కన్వీనర్ రమణారెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేత్రదానం

పులివెందుల టౌన్ : నేత్రదానం చేయడంవల్ల ఇద్దరి అంధులకు చూపును ప్రసాదించవచ్చునని నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక జొన వెంకటయ్య వీధికి చెందిన రిటైర్డు తెలుగు టీచర్ చిన్న పుల్లయ్య మృతి చెందారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్ర సేకరణ కేంద్ర అధ్యక్షుడు రాజు సభ్యులతో కలిసి మృతుడి ఇంటికి వెళ్లి చిన్నపుల్లయ్య మృతదేహం నుండి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు మరణించిన 9966509364, 7093204537 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ప్రజా సమస్యలపై శ్రద్ధ చూపండి

కమలాపురం : మండల స్థాయి అధికారులందరూ క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడంలో శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే చైతన్యరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ గండి భారతి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా వేసవి కాలంలో ఎక్కడే గాని నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అలాగే ప్రతి ఇంటి వద్ద శుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైన్స్ లేని చోట ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు పార్టీలకతీతంగా పని చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ రాఘవరెడ్డి, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ చాల ముఖ్యం

వేంపల్లె : విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించాలంటే క్రమ శిక్షణ అనేది చాలా ముఖ్యమని సంఘమేశ్వర విద్యా సంస్థల కరస్పాండెంట్ సుబ్బనాయుడు తెలిపారు. వేంపల్లెలో శుక్రవారం రాఘవేంద్ర పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఎంఇఓలు జాఫర్ సాదిక్, స్టాలిన్, పాఠశాల హెచ్ఎం సబితా పర్వీనా, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

వేంపల్లి : స్థానిక శ్రీ శ్రీనివాస హైస్కూల్ 13వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ పాలగిరి కేశవులు, డైరెక్టర్ పాలగిరి చంద్రబాబు, ఏపీ జేఏసీ చైర్మన్ లెక్కల జోగిరామిరెడ్డి, వేంపల్లి మాజీ ఎంఈఓ జాఫర్ సాదిక్ ఎంఈఓ –2 స్టాలిన్ ఐజాక్, ట్రిపుల్‌ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ బాలగోవింద, ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ డాక్టర్ కార్తిక్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ అనిల్‌కుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు. స్కూల్ టాపర్‌గా అరవింద్‌రెడ్డికి బహుమతిని అందజేశారు.

సర్వేలు ఫుల్.. సేవలు నిల్

- నర్వేల పేరుతో ఉద్యోగులకు పని ఒత్తిడి
- ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న సచివాలయాలు
- సేవలు అందక ప్రజల ఇక్కట్లు



సచివాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

సింహాద్రిపురం : స్థానికంగానే ప్రజలకు సేవలు అందించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను రూపకల్పన చేసి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో మండల కేంద్రంలో లభించే సేవలు గ్రామ సచివాలయంలోనే పొందే అవకాశం లభించింది. అయితే కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. రేషనలైజేషన్ పేరుతో సచివాలయ సిబ్బందిని ఆందోళనలో నెట్టింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై దాదాపు పది నెలలు కావస్తున్నా.. ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయకుండా కాలయాపన చేస్తోంది. సంక్షేమ పథకాలు ఆటలెక్కించడమే కాకుండా, సర్వేల పేరుతో సచివాలయ సిబ్బందిని ఇంటింటికి పంపించడంతో సచివాలయాలు ఖాళీ కూర్చీలతో దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలకు సక్రమంగా సేవలు అందడం లేదు. మళ్లీ మండల కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సర్వేల పేరుతో ఉద్యోగులకు పని ఒత్తిడి

మండలంలో 20 గ్రామ పంచాయతీలకు గాను 12 సచివాలయాలు, 12 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ప్రతి సచివాలయంలో 11 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. కానీ కొన్ని సచివాలయాల్లో పూర్తి సిబ్బంది లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ సిబ్బందికి గడ్డుకాలం ఎదురైంది. ఒక్క సంక్షేమ పథకం అమలు చేయకుండానే సర్వేల పేరుతో సచివాలయ సిబ్బందిని ఇంటింటికి పంపే కార్యక్రమం చేపట్టింది. ఇప్పటి వరకు దాదాపు 20 సర్వేలు పూర్తి చేయించింది. సర్వేల పేరుతో ప్రభుత్వ సెలవు రోజు కూడా సర్వేలు చేసే పరిస్థితి ఏర్పడిందంటే పని ఒత్తిడి ఏస్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. పని ఒత్తిడి తట్టుకోలేక వివిధ శాఖల సచివాలయ సిబ్బంది సతమతమవుతూ ఉన్నతాధికారులకు మొర పెట్టుకుంటున్నా.. అధికారులు పట్టినట్టు ఉంటున్నారని వాపోతున్నారు

ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలు

వివిధ సర్వేలతో సచివాలయ సిబ్బంది సతమతమవుతున్నారు. మిస్సింగ్ సిటిజన్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయింగ్ సర్వే, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, డెత్ వెరిఫికేషన్, పీఎసీఎస్, 6 ఏళ్లలోపు పిల్లల మిస్సింగ్ ఆధార్, నాన్ ఏపీ రెసిడెన్షియల్, ఈజీవైసీ, వర్క్ ఫ్రం హోం, పస మిత్ర తదితర సర్వేలతో సిబ్బంది ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రతి సర్వేకు సెల్‌ఫోన్‌తో ముడిపడింది. సర్వే పూర్తి కావాలంటే మొబైల్‌కు వచ్చే ఓటీపీ చెప్పాలి. ఓటీపీ కాకుంటే సర్వే చేసిన మొత్తం వృథా అవుతోంది. మళ్లీ మొదటి నుంచి సర్వే చేయాలని సిబ్బంది వాపోతున్నారు.

గతంలో అన్ని సేవలు సులభం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్థానికంగానే ప్రజలకు సులభంగా సేవలు అందేవి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై పది నెలలవుతున్నా ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయకుండా కాలయాపన చేస్తోంది. సర్వేలు చేయించడమే తప్ప.. ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడంలేదు. సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారు. గతంలో ఉన్న అన్ని సేవలను కొనసాగిస్తే బాగుంటుంది.

– మనోహర్‌రెడ్డి, ఎంపీటీసీ, బి.చెర్లోపల్లె, సింహాద్రిపురం

ప్రజలు ఇబ్బంది పడుతున్నారు



ప్రజలు గతంలో ఏ చిన్న అవసరం వచ్చినా సచివాలయానికి వెళ్లి పనులు చేయించుకునేవారు. ఇప్పుడు సచివాలయంలో సేవలకు బ్రేక్ పడటంతో కథ మళ్లీ మొదటకు వచ్చింది. ఏ చిన్న సర్టిఫికేట్ కావాలన్న మండల కేంద్రాలకు వెళ్లే పరిస్థితి ఏర్పడింది. సేవలు ఆగిపోవడమే కాకుండా సచివాలయ సిబ్బందిని సర్వేల పేరుతో ఇంటింటికి పంపుతున్నారు.

– మహేశ్వరరెడ్డి, స్థానికుడు, సింహాద్రిపురం

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

పెండ్లిమర్రి : పంటలు సాగు చేసే ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంట సాగు చేసేలా ప్రొత్సహించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం 2025–26 సంవత్సరం ఖరీఫ్ ప్రణాళికలపై మండల స్థాయి సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల సమన్వయంతో ప్రకృతి వ్యవసాయం గురించి విస్తృతంగా రైతులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం వసంతకుమారి, ఏఓ ఓబులేసు, ఏపీఎం బాలస్వామి, మాస్టర్ ట్రైనర్ గంగిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం

పులివెందుల రూరల్ : రైతుల సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం తగదని ఎమ్మెల్సీ బి.రాంగోపాల్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గంలో రెవెన్యూ అధికారులు రీసర్వేలో సమస్యలు ఉత్పన్నమవుతున్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. రైతుల సమస్యలకు పరిష్కారం చూపకపోతే జూన్ 1న రైతులతో కలిసి ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని అధికారులను హెచ్చరించారు.

భూ రీసర్వేకు గ్రామస్తులు సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఈశ్వరయ్య

లింగాల : భూ రీసర్వేకి గ్రామస్తులు సహకరించాలని తహసీల్దార్ ఈశ్వరయ్య తెలిపారు. శుక్రవారం చిన్నకుడాల గ్రామంలో భూ రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రస్తుతం వెబ్‌ల్యాండ్‌లో నమోదై ఉన్న వారిలో ఎవరైనా మరణిస్తే వారి కుటుంబీకుల పేర్లు నమోదు చేసుకునేందుకు, ఎవరైనా భూములు కొనుగోలు చేసిన యెడల వారి పేర్లు నమోదు చేసుకునేందుకు 5 మంది రెవెన్యూ అధికారులను ప్రత్యేకంగా నియమించడం జరిగిందన్నారు. అనంతరం చిన్నకుడాల గ్రామంలో రెవెన్యూ అధికారులు, రెవెన్యూ సిబ్బంది భూరీసర్వే అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న సీఐ మహమ్మద్‌రఫీ

కొండాపురం : గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు. జిల్లా ఎస్పీ అదేశాల మేరకు వెంకయ్యకాల్వ గ్రామంలో సీఐ, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి పోలీసు బలగాలతో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో ప్రతి ఇంటిని క్షుణంగా తనిఖీలు చేశామన్నారు. గ్రామంలో సరైన పత్రాలు లేని 22 బైకులను స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామంలో ఏ సమస్య వచ్చిన పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనవసరంగా రేచ్చగొట్టే మాటలు మాట్లడుకోవడం వల్ల గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరు శాంతియుతంగా జీవించాలన్నారు.

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించాలి

పులివెందుల రూరల్ : జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించాలని ఉపాధి హామీ ఏపీడీ ఆదిశేషారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించి క్లస్టర్ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఉపాధి హామీ పీడీ హాజరై మాట్లాడుతూ పశువులకు నీటి తొట్ల పనులను నీటి వసతి ఉన్న ప్రదేశంలో నిర్మించాలన్నారు. పశువులు రాకపోకలు గుంపుగా చేసేందుకు ఉన్న ప్రదేశంలో నీటి తొట్టెలు నిర్మించాలన్నారు. సేద్యపు నీటి కుంటలను లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం వచ్చేలోపు పంట కాలాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. విస్తృతస్థాయిలో కూలీలకు పనులు కల్పించి కుంటలు, చెరువులు సామర్థ్యం పెంచి నీరు ఉంచేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామి ఈపీడీ సోమశేఖరరెడ్డి ఏపీఓలు, సీసీలు, టీఏలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో మంచి పతకాలు సాధించాలి



భవిత కేంద్ర విద్యార్థికి స్వీటు తినిపిస్తున్న ఎంఈఓ, తదితరులు

వేంపల్లె : భవిత దివ్యాంగ కేంద్రంలో చదువుతున్న విద్యార్థులు క్రీడా పోటీల్లో రాణించి మరింత కృషితో మంచి పతకాలు సాధించాలని వేంపల్లె మండలం విద్యాశాఖ అధికారులు జాఫర్ సాదిక్, స్టాలిన్ ఐజాక్‌లు ఆకాంక్షించారు. శుక్రవారం భవిత దివ్యాంగుల కేంద్రం విద్యార్థులను ఎంఇఓలు అభినందిస్తూ స్వీట్లు తినిపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఈనెల 21, 22, 23వ తేదీలలో ప్రత్యేక అవసరాల గల పిల్లలకు విజయవాడలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వేంపల్లె భవిత దివ్యాంగుల కేంద్రం విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థి వెంకటతేజ 50, 100 మీటర్ల పరుగు పోటీల్లో రెండో స్థానం కైవసం చేసుకోగా, సైక్లింగ్ రేస్ పోటీల్లో రాజ్‌కుమార్ మూడో స్థానంలో నిలిచి పతకాలు సాధించారు. వీరి పట్ల సమగ్ర శిక్ష జిల్లా ఐఈ కోఆర్డినేటర్ రమణమూర్తి, స్థానిక ఎంఇఓలు అభినందించారు. ఎరగ్రుంట్లకు చెందిన ఐఈఆర్పీ బి.రవికుమార్ వీరికి శిక్షణ ఇచ్చి రాష్ట్రస్థాయి పోటీలకు తీసుకెళ్లారు. వీరితో పాటు ఐఈఆర్పీ కృష్ణవీర బ్రహ్మం వెళ్లారు. కార్యక్రమంలో వేంపల్లె భవిత కేంద్రం ఐఈఆర్పీలు యశోద, సుజాత, ఫిజియోథెరపి డాక్టర్ ఆనంద్, విద్యా వనరుల కేంద్రం సీఆర్పీలు పాల్గొన్నారు.

మతమార్పిడికి సంబంధించిన సభలు కాదు

పులివెందుల రూరల్ : పట్టణంలో మే 5, 6, 7వ తేదీలలో నిర్వహించే రక్షణ సువార్త సభలను విజయవంతం చేయాలని ఫ్లెక్సీలను రింగ్ రోడ్డు చుట్టూ ఏర్పాటు చేశామే తప్ప అవి మత మార్పిడి సంబంధించిన ఫ్లెక్సీలు కాదని పులివెందుల పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రశాంత్, సభ్యులు తెలిపారు.

శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొంతమంది పార్టీల నాయకులు మత మార్పిడులకు సంబంధించి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

ఉగ్రదాడులను కలసికట్టుగా ఎదుర్కొందాం



కమలాపురంలో మానవ హారంగా ఏర్పడిన ముస్లింలు



పులివెందులలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



జమ్మలమడుగులో కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

కమలాపురం : దేశంలో జరిగే ఉగ్ర దాడులను కలసికట్టుగా సమర్థవంతంగా ఎదుర్కొందామని కమలాపురం దర్గా–ఉ–గఫారియా, జహీరియా పీఠాధిపతి, సజ్జాద్–ఏ–నషీన్ హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి తెలిపారు. శుక్రవారం స్థానిక దర్గా మస్జిద్‌లో ప్రత్యేక నమాజ్ అనంతరం ముస్లిం సోదరులు నల్ల రిబ్బన్లు ధరించి దర్గా ఎదుట భారీ ఎత్తున చేరుకున్నారు. రోడ్డుపై మానవహారం ఏర్పాటు చేసి నిరసన వ్యక్తం చేశారు. జమ్ము–కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి మాట్లాడుతూ జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడైనా సరే ఉగ్ర దాడులు జరిగితే వాటిని మనమందరం కలసికట్టుగా సమర్థవంతంగా ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. టెర్రరిజం అనేది మతానికి సంబంధించిన అంశం కాదని, అది దేశానికి సంబంధించిన అంశం అన్నారు. ఇలాంటి దాడులు ఎక్కడ జరిగినా భారతీయులమంతా ఒకేతాటిపైకి వచ్చి వాటిని అడ్డుకునేందుకు తమ వంతు కృషి చేయాలన్నారు. పీఠాధిపతి సోదరులు మౌలానా ఖాద్రి మాట్లాడుతూ దేశంలో ఉగ్రదాడులు జరగడం బాధాకరమన్నారు. పహల్గాం దాడిలో 26 మంది మృతి చెందడం హృదయ విదారకర ఘటన అన్నారు. ఇలాంటి ఘటనలను మనమంతా కలసి కట్టుగా అడ్డుకోవాలన్నారు. ఈ అంశాన్ని కొందరు హిందు, ముస్లింల మధ్య విభేదాలు సృష్టించే విధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు దస్తగిరి షా ఖాద్రి, గౌస్‌పాక్, దర్గా కన్వీనర్, వైఎస్సార్ సీపీ మైనార్టీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఇస్మాయిల్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల : పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలోని ఓ కాలనీలో శుక్రవారం రాత్రి ముస్లింలు పహల్గాంలో జరిగిన మారణ కాండను ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ యూత్ విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.షామీర్‌బాషా మాట్లాడుతూ హిందు, ముస్లింలు ఐకమత్యంగా ఉండాలని ఈ నిరసన ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : ఉగ్రవాదులు జరిపిన దాడికి నిరసనగా శుక్రవారం కన్నెలూరు గ్రామ ప్రజలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. భారతీయులు ఒక్కటై నిలబడాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం మృతి చెందిన వారికి నివాళులు అర్పించారు.

దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు : పట్టణంలోని 58వ బ్రాందీ షాపుకోసం ఆసక్తి కలిగిన వ్యాపారులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రొహిబిషన్ ఏక్సైజ్ సీఐ సరిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యాపారులు రూ.2 లక్షలు దరఖాస్తుల ఫీజు చెల్లించి ఏక్సైజ్ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. మే 3వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకుంటే 5వ తేదీన కలెక్టర్ చేతుల మీదుగా డ్రా తీస్తారన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు

వేంపల్లె : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో స్థానిక లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. మిదత్ ఆసియా బేగం 584, ఎస్.ఆయిషా 573, ఎస్.సమైలా 563, ఎస్.నాసిరా 543, ఎస్.మహేజబీన్ 508, ఎస్.జాహీద ఫర్హాన్ 502 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ చూపారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎస్ఎఫ్ బాషా హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థుల ప్రతిభ

వేంపల్లె : పదవ తరగతి పరీక్షా ఫలితాలలో స్థానిక శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ బి.చక్రపాణి రెడ్డి తెలిపారు. జి.సాయినాథ్ 597 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మూడవ స్థానం, జిల్లా స్థాయిలో రెండవ స్థానం సాధించారన్నారు. అలాగే పి. గురుభావన 595, బి.వి ఉదయ్ అర్జున్, ఎం సాయిశరత్ శివనారాయణలు 592 మార్కులు సాధించి ప్రతిభను కనబరిచినట్లు తెలిపారు. అలాగే 590కి పైగా 40 విద్యార్థులు, 580–590 మధ్య మార్కులు 7 మంది విద్యార్థులు, 550–580 మార్కుల మధ్య 32 మంది విద్యార్థులు విజయం సాధించారన్నారు. మొత్తం 155 మంది విద్యార్థులు హాజరు కాగా, 500 పైగా విద్యార్థులు 95 మంది మార్కులు సాధించారన్నారు.

ఆలయాల హుండీల లెక్కింపు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీఅంకాలమ్మతల్లి ఆలయంతోపాటు శ్రీమిట్టమల్లేశ్వరస్వామి, పడమర ఆంజనేయస్వామి ఆలయాలలో శుక్రవారం దేవదాయ ధర్మదాయ శాఖ సిబ్బంది భారతి ఆధ్వర్యంలో హుండీల ఆదాయ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ రమణ మాట్లాడుతూ అంకాలమ్మ ఆలయ హుండీల ద్వారా రూ.1,21,960ల ఆదాయం వచ్చిందన్నారు. అలాగే మిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలోని హుండీ ఆదాయం రూ.74,682లు, పడమర ఆంజనేయస్వామి ఆలయంలో ఉన్న హుండీ ద్వారా రూ.43,642ల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రూప్ ఆఫ్ టెంపుల్ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, అంకాలమ్మ ఆలయ చైర్మన్ నాగేంద్ర ప్రసాద్, మాజీ చైర్మన్ గంగాధర్, కొండ గంగమ్మ ఆలయ ఈఓ మారుతి ప్రసాద్, ఆలయ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో కాన్పులు జరిగేలా అవగాహన పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎంవో డాక్టర్ శశిభూషన్‌రెడ్డి

వల్లూరు : ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పులు జరిగేలా వైద్య సిబ్బంది గర్భిణులకు అవగాహన కల్పించాల్సిన అవసరం వుందని డీపీఎంవో డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జరిగిన నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వీలైనంత వరకు కాన్పులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగేలా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రికి వచ్చిన రోగులతో ఆయన మాట్లాడారు. వారికి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు వంద శాతం టీకాలు వేయించాలని సూచించారు. మలేరియా దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన చర్యలను గురించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఫణీంద్ర, సీహెచ్‌వో వేణుగోపాల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యం



మురుగునీటి తొలగింపు పనులను చేయిస్తున్న ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి

పులివెందుల రూరల్ : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడమే తమ లక్ష్యమని ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి తెలిపారు. శుక్రవారం నల్లపురెడ్డిపల్లె, నల్లగొండువారిపల్లెల్లో ఆయన పర్యటించి మాట్లాడారు. గ్రామాల రోడ్లపై ఉన్న మురుగునీరు, చెత్తాచెదారాలను తొలగించి రోడ్లను పరిశుభ్రంగా ఉంచడం జరిగిందన్నారు. అలాగే నీరు నిల్వ ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్ చల్లామన్నారు. గ్రామాల్లోని ప్రజలు కూడా రోడ్లను, కాలువలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి పరిసర ప్రాంతాలలో ప్రజలు కూడా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎప్పుడైతే రోడ్డు అపరిశుభ్రంగా ఉంచుతారో, అప్పుడు దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. అందువల్ల గ్రామీణ ప్రాంతాలలో సమస్యలు వచ్చిన వెంటనే అధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా దినోత్సవంపై అవగాహన ర్యాలీలు



వేంపల్లెలో ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది



ఎర్రగుంట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న హెల్త్ సిబ్బంది



చెన్నూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

వేంపల్లె : మలేరియా వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించినట్లు తాళ్లపల్లె పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ పృథ్వీకుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా తాళ్లపల్లెలో వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ప్లాస్మోడియం పరాన్నజీవి ద్వారా సోకిన ఆడదోమ కుట్టడంవల్ల మలేరియా వస్తుందన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ షఫీఉన్నిషా, సీహెచ్ఓ వెంకటరత్నం, సూపర్వైజర్లు, ఏఎన్ఎం, సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూరులో..

వల్లూరు (చెన్నూరు) : మలేరియా మహమ్మారిని అంతం చేసేందుకు అందరూ కృషి చేయాలని చెన్నూరు మండల వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఆయన అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. దోమతెరలు వాడాలని సూచించారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని డాక్టర్ గణేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని చిలంకూరులో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలి, జ్వరం అనేవి మలేరియా లక్షణాలు అన్నారు. ప్రతి ఒక్కరు కచ్చితంగా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతోపాటు, రాత్రిపూట దోమతెరలను వాడాలని సూచించారు.

లింగాలలో..

లింగాల : మలేరియా వ్యాధి నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పీహెచ్‌సీ డాక్టర్ సుభాషిణి తెలిపారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని లింగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది మలేరియా దినోత్సవం ర్యాలీ లింగాల బస్టాండు వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో శుభ్రత, నీటి నిల్వలపై జాగ్రత్తలు పాటించాలని, ఏ చిన్న లక్షణం కనిపించినా వెంటనే పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య, సీహెచ్ఓ శివరాం, పీహెచ్ఎన్ కుసుమకుమారి, సూపర్ వైజర్ హషియా బేగం, ల్యాబ్ టెక్నీషియన్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : మలేరియా వ్యాధిని శాశ్వతంగా నిర్మూలించేటందుకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు శ్రీకాంత్, నాగార్జునలు తెలిపారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రసాద్, ఆరోగ్యాధికారి శ్రీనివాసులరెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ జాషన్, సూపర్‌వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : ప్రజలు తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రఫీక్ పాషా తెలిపారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా సిబ్బందితో కలసి ఆయన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు.

ఘనంగా గంధోత్సవం



ప్రార్థనలు నిర్వహిస్తున్న భక్తులు

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలో వెలసిన హజరత్ సయ్యద్ షా గూడుమస్తాన్ వలీ గంధం ఉత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలో స్వామి వారి పూల చాందినీతో భక్తులు మెరవణి నిర్వహించి అనంతరం దర్గాకు చేరుకుని ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారికి మొక్కుబడులను చెల్లించుకున్నారు. పట్టణ సీఐ ఎస్.లింగప్ప బందోబస్తును ఏర్పాటు చేశారు. అనంతరం రాత్రి డ్యాన్స్ ప్రోగ్రాం నిర్వహించారు.

అవగాహన కల్పించాలి

వీరపునాయునిపల్లె : రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించాలని కమలాపురం సహాయ వ్యవసాయ సహాయకులు నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని కీర్తిపల్లెలో మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో భూసార పరీక్షలపై అవగాహనా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూసార పరీక్షలు చేయించుకోవడం వలన భూమిలోని పోషక విలువల స్థాయిలను తెలుసుకోవచ్చన్నారు. అనంతరం మట్టి నమూనా సేకరించే విదానాన్ని రైతులకు డెమో ద్వారా చూపించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.